క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బచ్చన్నపేట: బచ్చన్నపేట ఎస్సైగా బండి శ్రవణ్‌కుమార్ గురువారం పదవీ బాధ్యతలను చేపట్టారు. శ్రవణ్‌కుమార్ స్టేషన్‌ఘన్‌పూర్‌లో ట్రెయినీ ఎస్సైగా పని చేసి ఎస్‌హెచ్‌ఓగా ఇక్కడ పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్నవారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని, మధ్యవర్తులను ఆశ్రయించకూడదన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

చిల్పూరు: గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నూతన కమిటీలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేటలో గురువారం పార్టీ గ్రామ నూతన కమిటీలను నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు ప్రకటించారు. అధ్యక్షుడు కుడిశాల రవిని ఏకగ్రీవంగా ప్రకటించారు. దుర్గాప్రసాద్, యాదిరెడ్డి, రాజయ్య, ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో నిర్వహించే గ్రూప్‌–4 పరీక్షకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని నర్మెట సీఐ నాగబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పరీక్ష రాసే పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని బిషప్ తుమ్మబాల పాఠశాల, ఆదర్శ పాఠశాల, వాణీ పాఠశాలలో పలువురు అభ్యర్థులు శనివారం గ్రూప్‌–4 పరీక్షను రాస్తారని తెలిపారు. అందుకు అన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రిన్సిపాల్స్ జోసఫ్, భాస్కరుని సుమలత, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆర్థికసాయం



తరిగొప్పుల: మండలకేంద్రానికి చెందిన ఎర్రోజు సుభాషిణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్‌గౌడ్ గురువారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా మండలకేంద్రానికి చెందిన పండుగ రాజు అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా చలించిన కిరణ్‌కుమార్ గౌడ్ రూ.35,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించి బాధితుని అందజేశారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండల కేంద్రంలో మామిండ్ల మల్లయ్య అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి గురువారం మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

దుర్గామాత ఆలయాల్లో చోరీ

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ దుర్గామాత ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి బంగారం, వెండి, నగదు చోరీ చేసిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. గ్రామ శివారులోని దుర్గామాత ఆలయం వద్ద ముదిరాజ్‌లు ఉదయం శుభ్రం చేసేందుకు రాగా తాళం పగులకొట్టి తలుపు ఊడ దీసి ఉంది. దొంగతనం జరిగినట్లు వారు గుర్తించి సర్పంచ్, గ్రామ పెద్దలకు సమాచారమిచ్చారు. ఆలయం వద్దకు వచ్చి చూడగా అమ్మవారి విగ్రహంపై ఉన్న తులం బంగారం, 40 తులాల వెండి, హుండీలోని డబ్బులను దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రఘుపతి ఆలయం వద్దకు చేరుకొని చోరీ ఘటనపై స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: మండలంలోని కొన్నెలోని దుర్గామాత ఆలయంలో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. గ్రామస్తులు, ఆలయ పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. పూజారి పసుల నిర్మల, లింగం దంపతులు రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి ఆలయాన్ని శుభ్రం చేసి తాళం వేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చి చూసే సరికి గుడి తలుపులు పగులగొట్టి అమ్మవారి వెండి కళ్లు, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయం వద్దకు పోలీసులు వచ్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సుజాత మృతదేహం లభ్యం

దేవరుప్పుల: మండలంలోని సీత్యతండాలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన గుగులోత్ సుజాత(38) మృతదేహాన్ని గురువారం వెలికితీశారు. మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి సీత్యతండాకు చెందిన గుగులోత్ వీరన్న అక్రమ సంబంధం పెట్టుకోవడమేగాక భార్య సుజాతను వేధించడంతోనే మనస్థాపం చెంది బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి వాంకుడోత్ పాండ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రినుంచి మోటర్లతో బావిలో నీరుతోడగా గురువారం ఉదయం సుజాత మృతదేహం లభ్యమైందని, పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు

జనగామ: బాణాపురం వేంకటేశ్వర ఆలయంలో కలశపూజ



జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో..



జనగామ: అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



జనగామ: సాయిబాబా ఆలయంలో..



తొలి ఏకాదశి పండుగను గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వర్షాలు విరివిగా కురిసి, అన్నదాతలు, అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు. తొలి ఏకాదశి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మశాల ఏరియా వాసవి కన్యకా పరమేశ్వరి, నగరేశ్వర సీతారామచంద్ర స్వామి ఆలయంలో వాసవి మాతా శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: బతుకమ్మకుంట దుర్గామాత ఆలయంలో భక్తుల పూజలు



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్ శివాలయంలో..



లింగాలఘణపురం: జీడికల్‌లో..



బచ్చన్నపేట: సిద్దేశ్వరాలయంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: తిరుమలనాథ స్వామి ఆలయంలో..



చిల్పూరు: పూజ చేస్తున్న భక్తులు



నర్మెటలో..

విజయవంతం చేయండి

నర్మెట: సిద్దిపేట జిల్లా చేర్యాలలో శుక్రవారం తలపెట్టిన మహాజన సంపర్క్ అభియాన్ సభను బీజేపీ శ్రేణులు, అభిమానులు విజయవంతం చేయాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. కల్యాణి గార్డెన్స్‌లో ఉదయం నిర్వహించే సభకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ప్రభాకర్, రంజిత్, రామచందర్ రావు పాల్గొన్నారు.

ముస్లింలపై బీజేపీ, బీఆర్‌ఎస్ వివక్ష



ముస్లింలతో సింగపురం ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: ముస్లింల సమస్యలపై బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని, వారి సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేయగా వారికి ఆమె పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతోందని, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు చేసిన హామీలను విస్మరించారని రానున్న రోజుల్లో ఆ పార్టీలకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. అనంతరం శివునిపల్లి శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఇందిర ప్రత్యేక పూజలు చేశారు. శిరీష్‌రెడ్డి, జగదీష్‌చందర్‌రెడ్డి, లింగాజీ, ఎల్లయ్య, వెంకటయ్య, మహేందర్, సింగపురం నాగయ్య, ఐలపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమ గాయకుడికి ఘన నివాళి



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న కళాకారులు



పాలకుర్తి: నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు



దేవరుప్పులలో..

రఘునాథపల్లి: గుండెపోటుతో హఠాన్మరణం పొందిన తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ అకాల మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని మండలంలోని తెలంగాణ ఉద్యమ కారులు, కళాకారులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో దళితరత్న అవార్డు గ్రహీత, ఉద్యమ కళాకారుడు నీలం భాస్కర్ ఆధ్వర్యంలో సాయిచంద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉద్యమ కళాకారులు పెద్దగోని రాజు, కొడిదేటి కుమార్, జీడికంటి శ్రీనివాస్, దొరగొల్ల కుమార్, రాసమల్ల మల్లేష్, తాల్లపల్లి ఎల్లయ్య, ఆరూరి కుమార్, గడ్డం సందీప్, ఎడ్ల యాకస్వామి పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరనిలోటు

కొడకండ్ల: తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ అకాల మృతి బాధాకరమని ఎంపీపీ జ్యోతి అన్నారు. తెలంగాణ సమాజం గొప్ప కళాకారున్ని కోల్పోయిందని, తెలంగాణ ఉద్యమంలో, పునర్నిర్మాణంలో సాయిచంద్ ఎంతో కీలక భూమికను పోషించాడని, తన గానంలో ప్రతి ఒక్కరి గుండెలో చిరస్థాయిగా నిల్చిపోయాడని, సాయిచంద్ మృతి తీరని లోటని కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె కోరారు.

పాలకుర్తి: సాయిచంద్ మృతి బాధాకరమని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. పాలకుర్తిలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, సహకార సంస్థ చైర్మన్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే సాయిచంద్ మృతికి పట్టభద్రుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర వెంకన్న సంతాపం తెలిపారు.

దేవరుప్పుల: సాయిచంద్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జనగామ జనగామ–సూర్యాపేట రహదారిపై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి బీఆర్‌ఎస్ నాయకులు ఘననివాళులు అర్పించారు. జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ కారుపోతుల భిక్షపతి, సర్పంచ్ మూడ శంకర్ నాయక్, దశరథం, నగేష్, హనుమంతు, జోగు సోమనర్సయ్య పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్: సాయిచంద్ అకాల మరణం తెలంగాణకు, బహుజనులకు తీరనిలోటని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అభివృద్ధి సేవాసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు కలకోల యాదగిరి అన్నారు. డివిజన్‌కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సాయిచంద్ మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

అన్నదానం



దేవరుప్పుల: బక్రీద్ పర్విదినం పురస్కరించుకొని సీతారాంపురంలోని ప్రేమ సదన్ అనాథ శరణాలయంలో స్థానిక వీఆర్‌ఏ మహమ్మద్ ఖాజాబీ కుటుంబ సభ్యులు వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ఏటా పలు సార్లు వృద్ధులకు తోడ్పాటు అందిస్తున్న ముస్లిం కుటుబ సభ్యులకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. యాకూబ్ పాషా,ఆసియా,అస్రతజ్మీన్, నజీర్ మియా, ఆశ్రమ ఇంచార్జీ బ్రహ్మచారి, కొండమ్మ పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలి

- ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ సభ్యుడు డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ



మాట్లాడుతున్న బొల్లెపల్లి కృష్ణ

రఘునాథపల్లి: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇద్దరు ఉప ముఖ్యమంత్రులుగా పని చేసిన కాలంలో నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్(ఏఐపీసీ) సభ్యుడు డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాలకుల వైఫల్యంతో అభివృద్ధిలో నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందని, పేదలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేక సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నాయకులు వెంకటస్వామి, కంసాని నర్సింహారెడ్డి, బొల్లెపల్లి శ్రీనివాస్, కుమార్ తదతరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను గురువారం జనగామ పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకునేలా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



జనగామ: ముస్లింలతో కిక్కిరిసిన సిద్దిపేట రోడ్డులోని ఈద్గా



స్టేషన్‌ఘన్‌పూర్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ రాఘవేందర్



జనగామ:ఈద్గా వద్ద సీఐతో ముస్లింలు



నర్మెటలో..



రఘునాథపల్లి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సై రఘుపతి



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ఉష



చిల్పూరు మండల కేంద్రంలో..



దేవరుప్పులలో..



జనగామ: చిన్నారుల అలయ్‌బలయ్



బచ్చన్నపేట: వేడుకల్లో చిన్నారులు



జఫర్‌గఢ్‌లో.. ఎస్సై శంకర్‌నాయక్

అవినీతి పాలనను అంతం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ గుండె విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగిస్తున్న కుటుంబ, అవినీతి, దోపిడీ పాలనను అంతం చేసేందుకు ప్రజలందరూ చైతన్యం కావాలని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీతిరుమలనాథస్వామి దేవాలయంలో ఆయన గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని గాలికి వదిలేసి ప్రజా సమస్యల్ని పట్టించుకోకుండా దేశంతో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాసలీలలు, అవినీతి, అక్రమాలు, సెటిల్‌మెంట్‌లు అధికమయ్యాయని ఆరోపించారు. జిల్లా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు వరదకాల్వపై ఏమాత్రం పట్టింపులేదని, గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఎంతో అభివృద్ధి సాధించానని గొప్పలు చెప్పుకునే కడియం శ్రీహరికి వరదకాల్వ సమస్య కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వరదకాల్వకు రూ.20వేల కోట్లు మంజూరవడమే కాకుండా గౌరవెల్లి వరకు పనులు జరిగాయని, బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొజ్జపల్లి సుభాష్, ఐలోని అంజిరెడ్డి, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, గట్టు క్రిష్ణ, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్: వామపక్ష ఐక్యతకు విఘాతం కలిగిస్తూ సీఐటీయూ జెండాను తొలగించిన వారిపై చర్య తీసుకోవాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ సుంచు విజేందర్ అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఆకుల పెంటయ్య విగ్రహం ఆవిష్కరించిన సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్మించిన గద్దెపై సీఐటీయూ జెండా తొలగించడం సరికాదని అన్నారు. జెండాను తొలగించిన విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. నాయకులు వెంకటేష్,ఉపేందర్, మల్లేష్, ఆనందం, శివ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడానికి చెందిన బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి బోయిని రాజు తండ్రి రాములు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, గురువారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వంశీధర్‌రెడ్డి, గణపతి, స్వరూపరాణి ఉన్నారు.

కోర్టు ఆర్డర్ ప్రకారమే హక్కులు

పాలకుర్తి: మండలంలో మంచుప్పుల గ్రామంలో మత్స్యకార్మికులకు హక్కులు ఉన్న కుంటల్లో వారికే అవకాశం కల్పించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గురువారం ముదిరాజులు చేపలు పడుతుండగా స్థానిక గిరిజనులు ఈ కుంట తమదేనని వాదించారు. దీంతో ముదిరాజులు గతంలోనే హైకోర్టును సంప్రదించి ఆర్డర్ తీసుకొచ్చారని వివరించారు. కోర్టు తీర్పు ఆర్డర్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

జనగామ రూరల్: పద్దెనిమిదేళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎస్.మహిపాల్ అన్నారు. గురువారం గానుగుపహాడ్‌లో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు.

నేడు పంచాయతీ ఉద్యోగుల ర్యాలీ

బచ్చన్నపేట: తమ సమస్యల పరిష్కారం కోసం నేడు (శుక్రవారం) జిల్లా కేంద్రంలో పంచాయతీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జీఓ59 ఎత్తివేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, అర్హులైన వారందరిని పర్మినెంట్ చేయాలని కోరారు.

కొమ్మూరిపై విమర్శలు అవివేకం

బచ్చన్నపేట: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అక్రమాలను అతని కూతురు తుల్జాభవాని బయట పెడుతుంటే మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేయిస్తున్నాడని టీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేయడం అవివేకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ అన్నారు . గురువారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై అతని కూతురు గతంలో ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. అలాగే ఇటీవల వడ్లకొండ వద్ద తండ్రిని రోడ్డుపై నిలదీసిందని, చేర్యాల పట్టణంలో ఆమె పేరు మీద ఉన్న పట్టా భూమిని అక్కడి మున్సిపాలిటీకి రాసి ఇచ్చిందన్నారు. అన్ని వారే చేసుకొని అనవసరంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎంపీటీసీ మసూద్, సిద్దేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ చల్ల సురేందర్‌రెడ్డి, నాయకులు అయిలుమల్లయ్య, మోహిన్‌రెడ్డి, బుచ్చిరాజు, శ్రీనివాస్ ఉన్నారు.